క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించాలి

శాయంపేట : టెట్ ఫీజును తగ్గించాలని బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. టెట్ పరీక్ష ఒక పేపర్ రాసే వారికి రూ.200, రెండు పేపర్లు రాసేవారికి రూ.300 ఫీజు ఉండేదని తెలిపారు. ప్రస్తుతం టెట్ దరఖాస్తు ఫీజు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచడం, రెండు పేపర్లు రాసేవారికి రూ.2000 పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఫీజు పెంచడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 7లక్షల మంది నిరుద్యోగులను పరిగనలోకి తీసుకొని టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని ఆయన కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘం సర్వసభ్య సమావేశం నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సంఘం సభ్యులందరూ సమావేశానికి సకాలంలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘం లావాదేవీలు, జమ, ఖర్చులు సభ్యులకు చదివి వివరించనున్నట్లు పేర్కొన్నారు.

నియామకం



పరకాల : బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా శనిగరపు రాజు నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం నడుచుకుంటానని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన రాయపురం మల్లయ్య చిన్న కుమార్తె పల్లకొండ శ్రీలత ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. శ్రీలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు అన్నివేళలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, మాజీ సర్పంచ్ కత్తి దేవేందర్, శివరాం, కొత్తూరి సునీల్, యాకర సాంబయ్య, ఎలిషా, భాస్కర్, సారయ్య, సాంబయ్య, శ్రీను, రాజబాబు, వెంకన్న, శ్రీనివాస్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఓదార్పు



పరకాల : అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు సమన్వయ సమితి వరంగల్ జిల్లా మాజీ కన్వీనర్ బొల్లె భిక్షపతిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించాడు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నడికూడ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

సంత వేలం వాయిదా

పరకాల : 2024–2025 ఆర్థిక సంవత్సరానికి మేకలు, పశువుల సంతకు సీల్డుటెండర్, బహిరంగ వేలం నిర్వహించగా సరైన వేలం రాకపోవడంతో ఈ నెల 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ నిర్వహించే వేలం పాటలో పాల్గొనాల్సిన డిపాజిట్‌దారులు ఈనెల 29వ తేదీన సాయంత్రం 5గంటల్లోపు డీడీని కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సీపీకి ఫిర్యాదు

శాయంపేట : ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌ను దూషించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఆ సొసైటీ బాధ్యుడు ఇందారం నాగేశ్వర్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీకి ఫిర్యాదు చేశారు. పత్తిపాక, శాయంపేట తదితర గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణకు మారెపల్లి సునీల్ కృషి చేస్తున్నాడని తెలిపారు. అలాంటి వ్యక్తిపై పురుషపద జాలంతో దూషించిన హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సభ్యులు శ్యాంసుందర్, పురుషోత్తం, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

శాయంపేట : నూర్జహాన్‌పల్లిలో పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు సతీమణి, గణపురం జెడ్పీటీసీ గండ్ర పద్మ బుధవారం హాజరై ఆశీర్వదించారు.

దివ్యాంగులకు ఇంటినుంచే ఓటు

ధర్మసాగర్ : లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఇంటినుంచే ఓటువేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 85 ఏళ్లకు పైబడిన వారు, 40 శాతం అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి నిబంధనలకు అనుగుణంగా కంపార్టుమెంట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకొచ్చి ఓటును స్వీకరిస్తారని తెలిపారు. ఇంటి నుంచే ఓటేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకోసం ఫారం 12డీ నింపి రిటర్నింగ్ అధికారికి, సహాయ రిటర్నింగ్ అధికారికి అందించాలని అన్నారు. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ రాయాలని అన్నారు. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. మండల వ్యాప్తంగా 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న ఓటర్లు 738 మంది, 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు 394 మంది ఉన్నారని, మొత్తం 1132 మందికి ఈ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రణయ్, ఎంఆర్ఐ కిరణ్, ఏఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సదానందం

వరంగల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

హసన్‌పర్తి: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో పార్టీ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోదండరెడ్డి పిలుపునిచ్చారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, కోఆప్షన్ మాజీ సభ్యుడు పాషాతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు కృష్ణారెడ్డి, బీరం రవీందర్‌రెడ్డి, కందుకూరి పూర్ణచందర్, రజనీకాంత్, చంద్రమౌళి పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోదండరెడ్డి

కల్వర్టులు నిర్మించాలి

పర్వతగిరి: మండలంలోని కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాలను కలిపే ప్రధాన రహదారిపై కల్వర్టులను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని కొంకపాక శివాలయం ప్రాంతంలో, గోపనపల్లి చెరువు మత్తడి వద్ద కల్వర్టులను నిర్మించాలని కోరుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో కల్వర్టులు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని, తద్వారా రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు వాపోయారు. కల్వర్టులు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు నాణ్యతగా చేపట్టాలి

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి దిక్షకుంట్ల గ్రామానికి వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని తెలంగాణ రైతు కూలి సంఘం జిల్లా నాయకుడు అందె లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతు కూలి సంఘం ప్రతినిధుల బృందం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉప్పరపల్లి నుంచి దిక్షకుంట్ల గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఉప్పరపల్లి గ్రామ శివారులో చెరువు నుంచి వచ్చే వరదతో రోడ్డుపై వేసిన పైపులు కొట్టుకుపోతున్నాయన్నారు. దీంతో రెండు గ్రామాల గుండా పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం రోడ్డు కోతకు గురవుతుందన్నారు. రోడ్డు పనులుచేస్తున్న కాంట్రాక్టర్ గతంలో మాదిరిగా పైపులు వేసి రోడ్డు పనులు చేపట్టి చేతులు దులుపుకుందామని చూస్తున్నాడని ఆరోపించారు. శాశ్వత వంతెన నిర్మాణ పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు అందె మార్కెండయ, చింతకింది ఐలయ్య, వీరన్న, రెడ్డబోయిన గణేష్, తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న సంఘం నాయకులు

గ్రామదేవతకు పూజలు



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని రామాలయం వీధిలో ప్రతిష్ఠించిన బొడ్రాయికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బొడ్రాయి ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వేద పండితులు నరసింహామూర్తి, ప్రదీప్‌శర్మ, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్ ఆధ్వర్యంలో బొడ్రాయికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బొడ్రాయిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమంలో రామాలయ పూజారి శ్రీధర్ ఆచార్యులు, సత్యనారాయణ, మనోహర్, తిరుపతిరెడ్డి, రామదాసు పాల్గొన్నారు.

పాలకులవి ప్రజావ్యతిరేక విధానాలు

ఖానాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎంసీపీఐ(యూ) ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిరాయింపుల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేసీఆర్‌ను మించిపోయారన్నారు. కష్టపడి పని చేసిన నాయకులకు కాకుండా నూతనంగా చేరిన వారికి పట్టంకట్టడం బాధాకరమన్నారు. ప్రజావ్యతిరేక చట్టాలను సపోర్ట్ చేసే బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు, ఎన్నికల కమిషన్ నియామకం, మద్దతు ధర చట్టం తీసుకురావడం, కార్మిక వ్యతిరేక చట్టాలు తేవడంలో బీజేపీ ఇష్టారీతిన వ్యవహరిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించే కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబురావు, మండల కార్యదర్శి యాదగిరి, హరిబాబు, రాఘవులు, నర్సయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలందించాలి

కాశిబుగ్గ: ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలందించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఓసిటీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నర్మెట ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, సిలువేరు శ్రీనివాస్, సందెల లాజర్, పోలెపాక సుధాకర్, మార్క్ జాన్సన్, ట్రస్ట్ సభ్యులు సుగుణ, వేణు, శంకర్, ఆదిత్య పాల్గొన్నారు.

భూదాన్ భూముల ఆక్రమణపై విచారణ జరపాలి

నయీంనగర్: భూదాన్ భూములకు రక్షణ కల్పించి, భూదాన్ భూముల ఆక్రమణపై సీబీఐతో విచారణ జరపాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోకుండా భూదాన్ బోర్డు రద్దు చేసి రూ.కోట్ల విలువ చేసే భూములతో భూదందా చేసిందని విమర్శించారు. రూ.వేల కోట్ల విలువ చేసే భూదాన్ భూములను మై హోమ్ రాజేశ్వర్ రావు, అక్రమార్కులు ఆక్రమించుకొని కట్టిన ఫ్యాక్టరీలు, కోటలను కూల్చి నిరుపేదలకు పంపిణీ చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు భూస్వాములు, రాజకీయ నాయకులు భూదాన్ భూములను దానంగా ఇచ్చినట్లే ఇచ్చి వారే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న భూదాన్ భూములను గుర్తించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని శంకర్‌నాయక్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రభాకర్ రావు, శ్రావణ్ నాయక్, రామస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

కాజీపేట: కాజీపేట పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులతో స్థానికులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. మద్యం షాపుల యాజమానులు దగ్గరుండి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తుండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండంతో పట్టణంలోని పలు కాలనీల్లో విచ్చలవిడిగా దుకాణాలు వెలిశాయి. ప్రభుత్వం బెల్టుషాపులకు అనుమతి లేదని స్పష్టంగా ప్రకటించినప్పటికీ ఎక్కడ చూసినా మద్యం విక్రయాలు జోరుగా సాగుతుండడం పెద్ద చర్చనీయంశంగా మారింది. కాజీపేట – సోమిడి ప్రధాన రహదారిపై పలు బెల్టుషాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడాలేకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండడంతో మందుబాబుల హడావిడి ఎక్కువగా కనిపిస్తోంది. పది, ఇరువై రూపాయలు ఎక్కువైనా సమయానికి మద్యం దొరుకుతుండటంతో మద్యపాన ప్రియులు బెల్ట్‌షాపుల వైపే మొగ్గు చూపుతున్నారు. బాగా కిక్కు ఎక్కిన అనంతరం అసభ్య పద జాలంతో గట్టిగా కేకలు వేయడం, ఒకరినొకరు తిట్టుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళలో తమ ఇళ్లలోని బట్టలు, సామానులను తాగుబోతులు ఎత్తుకెళ్లడం, ఆరుబయట పడేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. చీకటి పడితే బెల్ట్ షాపులున్న మార్గాల్లో మహిళలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులతోపాటు పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలతో సంస్థకు ఎక్కువ ఆదాయం సమకూరుతుందని భావిస్తుండడమే అధికారులు పట్టించుకోకపోవడానికి ప్రధాన కారణంగా పలువురు చెబుతున్నారు.



కాజీపేటలో రోడ్డుపై మద్యం సేవిస్తున్న మందుబాబులు

పటాలు గీసి.. అవగాహన కల్పించి

కమలాపూర్ : మండలంలోని గూడూరులో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు గ్రామీణ అవగాహన, కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్టిసిపేటరీ రూరల్ అప్రైజర్ (పీఆర్ఏ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తుల నుంచి సేకరించిన సమచారాన్ని గూడూరు గ్రామపటం, వనరుల పటం, గ్రామ జనాభా (బార్ గ్రాఫ్), పంటనిష్పత్తి, భూమినిష్పత్తి, పశువుల నిష్పత్తిపై చార్ట్‌లు, చపాతిపటం (వెన్‌డయాగ్రాం), మ్యాట్రిక్స్ ర్యాంకింగ్, సంపద ర్యాంకింగ్, (టైమ్‌లైన్‌డేటా) అంశాలపై యూనివర్శిటీ అధ్యాపకులు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తుల సమక్షంలో పటాలను ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. యూనివర్శిటీ అధ్యాపకులు సాయికృష్ణ, లాల్‌సింగ్ రాథోడ్, శ్యామ్, పూజ, రవళి, ఏఓ లక్ష్మారెడ్డి, ఏఈఓ రాజు, మాజీ సర్పంచ్ సాంబయ్య, రైతులు భద్రయ్య, శేఖర్, వెంకటేశ్వర్లు, సాంబయ్య, వేణు, విద్యార్థులు కె.జయశ్రీ, కె.కావ్య, బి.సంధ్య, జె.త్రిష, వైఎం.అమ్ములు, ఎస్.తేజ, గ్రామస్తులు పాల్గొన్నారు.



పటాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

ఎల్కతుర్తి : బహుజన విధానాన్ని పాటిస్తూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందంవీరు పిలుపునిచ్చారు. బుధవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామాధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనాథ్, కోశాధికారిగా రజినీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా అశోక్, సలహాదారులుగా బాబు, వెంకటరాజ్యం, స్వామి, ప్రకాశ్, కార్యవర్గ సభ్యులుగా పవన్, అజయ్, నీరజ్, సుధీర్, దయాకర్, రాజు, విజయ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించిన మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఎనమిది గంటలు పని కల్పించే విధంగా చట్టాలు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, శ్రీకాంత్, కల్యాణ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు కండువా కప్పుతున్న సదానందం

బీమాతో కుటుంబానికి ధీమా

ఐనవోలు : ప్రతిఒక్కరూ బీమా పాలసీ పొంది కుటుంబానికి ధీమా కల్పించాలని ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కాత వీరస్వామి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోగల ఆంజనేయ పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన అల్లాడి గణేష్ ఇటీవల మృతిచెందాడు. కాగా ఆయన సంఘం సాధారణ బీమా కలిగి ఉండటంతో రూ. 70 వేల బీమా డబ్బును బుధవారం నామినీగాఉన్న గణేష్ భార్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సంపాదించిన డబ్బులో కొంత పొదుపు చేసుకోవాలని సూచించారు. బీమా కలిగిఉంటే కుటుంబానికి ధైర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జున్ను అయిలయ్య, పాలకవర్గం, గణకులు తదితరులు పాల్గొన్నారు.



నామినీకి నగదు అందజేస్తున్న సభ్యులు

‘అమ్మ కమిటీ’తో పాఠశాలల బలోపేతం



ఎన్నికైన అమ్మ ఆదర్శ నూతన కార్యవర్గం

ఐనవోలు : అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని పున్నేలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వర్ అన్నారు. బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని(ఏఏపీసీ) ఎన్నుకున్నారు. పున్నేలు మహిళ సంఘాల అధ్యక్షురాలు పొన్నం రమ చైర్‌పర్సన్‌గా, పాఠశాల హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్ కన్వీనర్‌గా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి నుంచి పిల్లల తల్లులు మహిళా సంఘం సభ్యులుగా ఉన్నవారిని ముగ్గురు చొప్పున ఎన్నుకుంటూ అందులో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ ఉండేవిధంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పాఠశాలలు మరింత బలోపేతం అయ్యేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు దోహదపడుతాయన్నారు. మౌలిక వసతులు మెరుగుపడేందుకు ఏఏపీసీ కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో 15 మంది సభ్యులతో పాటు ఉపాధ్యాయులు వసంత, యాకయ్య, కొమురయ్య, ఇందిరా, స్వప్న, నరేందర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలి

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్ల శివారులోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగవంతుడి అనుగ్రహం గొప్పదని అన్నారు. దైవానుగ్రహం ఉంటే అన్నిరంగాల్లో రాణించే అవకాశాలు ఉంటాయన్నారు. మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షులు వరుణ్‌గాంధీ, రాజేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దుగ్గొండి: మండలంలోని కేశవాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈమేరకు ఉదయం నిత్యారాధన, ద్వారతోరణం కార్యక్రమం నిర్వహించి శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వరస్వామికి ఆలయంలోని కోనేరులో చక్రస్నానం అనంతరం తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించి ఉత్సవాలు ముగించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి– సునంద దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. స్వామి అనుగ్రహం ప్రజలపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కంది తిరుపతిరెడ్డి–పూలమ్మ, జితేందర్‌రెడ్డి–సరళ, మనోహర్‌రెడ్డి–కృష్ణవేణి, సురేందర్‌రెడ్డి–లక్ష్మీ, ఆలయ ఈఓ కిరణ్‌కుమార్, జితేందర్, అర్చకులు దేశికస్‌చార్యులు, సాగర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : ప్రసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగట్టు జాతరలో భక్తుల రద్దీ

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజు గురువారం రాత్రి భక్తులు తాకిడి ఎక్కువగా కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు సమర్పించారు. ప్రత్యేక దర్శనం వద్ద భక్తులు కిక్కిరిసిపోయారు. హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో రాజయ్యకు స్వాగతం పలికారు. విశ్వక్సేనా ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, కనపర్తి రాజు, సదానందం, వింజమూరి రమణ, సురేష్, మూల నరోత్తం, శైలజ, ప్రశాంత్, సుమంత్, శ్రీనాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘అయోధ్య’కు భజన మండలి సభ్యులు

శాయంపేట : అయోధ్య బాలరాముడు, శ్రీకాశీ విశ్వేశరస్వామి సన్నిధి, త్రివేణి సంగమం యాత్రకు మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి, శ్రీ వేంకటేశ్వర భజన మండలి బృందం బుధవారం బయలుదేరారు. మాందాటి రాజు, పులి ఆంజనేయులు, రాజన్న, హనుమంతక్క, రాజమణి, శ్రీనివాస్, తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

